

రూ.లక్ష సాయం ఎందరికో ?

బీసీ కుల వృత్తిదారులకు అందించే లక్ష సాయం కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. అందేది ఎందరికో.. 8లో▸



భగీరథ లైన్‌మెన్లు..

మిషన్ భగీరథ పథకం లైన్‌మెన్ల జీవితాలు దుర్భరంగా మారాయి. అరకొర జీతాలతో అవస్థలు తప్పడంలేదు. 8లో▸



మోతాదు మించితే..

'మోతాదుకు మించి ఎరువులు వాడితే ప్రమాదకరం. అయినా రసాయనిక ఎరువులను అధికంగా వాడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాల్సిందే

- ప్రతియేటా విద్యార్థులకు తప్పని అవస్థలు
- నిరాహార దీక్షలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్



దీక్షలో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

బొంరాస్‌పేట: మండలంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. కళాశాల విద్య కోసం ప్రతియేటా విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. విద్యా సంవత్సరాలు గడిచిపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో జూనియర్ కళాశాల జాడే లేదన్నారు. ఆరేళ్ల క్రితం మండలానికి జూనియర్ కళాశాల మంజూరైందని చెబుతున్నారే తప్ప ఏర్పాటు కాలేదని అన్నారు. దశలవారీగా ఉద్యమాలు, నిరసనలు, ఆందోళన చేపట్టి జూనియర్ కళాశాల సాధించుకుందామని అన్నారు. ఇప్పటికైనా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

రేపటి తరానికి యువత ఆదర్శం కావాలి



మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశం

అనంతగిరి: నేటి యువతే రేపటి తరానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్, డిప్యూటీ డిఫెన్స్ న్యాయవాది రాము అన్నారు. ఈ మేరకు సోమవారం మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత సన్మార్గంలో పయనించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మనందరం అవగాహన కార్యక్రమాలతో విద్యార్థులను దురలవాట్లకు దూరంగా ఉండేలా చూడటం మనందరి బాధ్యత అన్నారు మాదకద్రవ్యాలకు బానిసలై ఎంతో మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ కేసుల్లో విధించే శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. అనంతరం లోక్‌అదాలత్, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాత్లావత్ ఫకీరా, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నియంత పాలనను తుదముట్టించాలి'

కందుకూరు: కేసీఆర్ నియంత పాలనను తుదముట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీకి అందరూ మద్దతుగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధి లోని ముచ్చర్ల, ఊట్లపల్లిలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో చల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. ఫార్మాసిటీ ఏర్పాటు తర్వాత కాలుష్యంతో ఈ ప్రాంతంలో నివసించలేని స్థితి ఏర్పడుతుందన్నారు. మరోవైపు ఫార్మాసిటీతో భూ ముల ధరలు పెరుగుతాయని చెప్పి బఫర్‌జోన్ ఏర్పాటు చేయడంతో అమాంతం పడిపోయాయన్నారు. ఫార్మాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు వ్యతిరేకించిన సబితారెడ్డి, ఇప్పుడు ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి తిరిగి రైతులకే భూములు అప్పగిస్తామన్నారు. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ వ్యతిరేక శక్తుల రాజకీయ పునరేకీకరణ జరగాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు డి.నరసింహాచారి, మైనార్టీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అజీజ్, గణేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, జిల్లా నాయకులు ధనుంజయ్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సి.మల్లేష్, నాయకులు నిరంజన్, అజయ్, రాజు, వి.బాబు, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



బస్సు కోసం రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

- ఇందూరు మీదుగా బస్సు నడపాలంటూ ఆందోళన

పెద్దేముల్: మండల పరిధిలోని ఇందూరు మీదుగా బస్సు నడపాలని సోమవారం జైరాంతండా విద్యార్థులు రోడ్డెక్కారు. సుమారు గంట పాటు ఓంలానాయక్‌తండా– జైరాంతండా రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాలు రెండువైపులా నిలిచిపోయాయి. గతంలో ఇందూరు, తట్టెపల్లి మీదుగా బస్సు నడిచేదని, ఆ బస్సును అడ్కిచెర్ల, జినుగుర్తి మీదుగా నడపడం వల్ల పాఠశాలకు వెళ్లే, వచ్చే సమయాల్లో బస్సులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోకపోవడంతో చేసేదిలేక ఆందోళనకు దిగాల్సివచ్చిందని వారు వాపోయారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దులో ఓంలానాయక్‌తండా, జైరాంతండా ఉండటంతో బస్సులు తప్ప మరో అవకాశం లేదని, వెంటనే సంబంధిత అధికారులు బస్సును వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు తాండూరు డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. జైరాంతండా బస్సును ఇందూరు మీదుగా నడపాలని కోరారు. వెంటనే స్పందించి డీఎం తప్పకుండా జైరాంతండా బస్సును ఇందూరు మీదుగా నడుపుతామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

గాడిన పడేదెన్నడో?

జిల్లాలో ఆర్టీఏ (రోడ్డు ట్రాన్స్ పోర్ట్ అథారిటీ) వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మూడేళ్లుగా గాడిన పడటంలేదు. ఏడాది క్రితం వికారాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో డీటీఓగా బాధ్యతలు నిర్వహించిన అధికారి జైలుపాలవగా అప్పటి నుంచి పూర్తి స్థాయి అధికారే లేరు. దీంతో అటు కింది స్థాయి సిబ్బందిలో జవాబుదారీతనం కరువైంది. ఇష్టారాజ్యంగా వసూళ్లపర్వం కొనసాగుతోంది. మరోవైపు వాహనదారులు ఓవర్‌లోడ్‌తో అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో అస్తవ్యస్తంగా ఆర్టీఏ వ్యవస్థ

- సూర్యాపేట డీటీఓకు అదనపు బాధ్యతలు
- ఏడాది కాలంగా ఇన్‌చార్జి అధికారితోనే సరి
- వారానికి రెండు రోజులే రాక
- కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యం



వికారాబాద్ ఆర్టీఏ కార్యాలయం

వికారాబాద్: మూడేళ్ల ముందునుంచే జిల్లాలో ఆర్టీఏ వ్యవస్థ గాడి తప్పింది. ఈ క్రమంలో అనేక ఆరోపణలను మూటగట్టుకున్న విషయం తెలిసిందే. పైగా అవినీతికి అడ్డాగా మారింది. ఉద్యోగులపై అజమాయిషీ లేకుండాపోయింది. వాహనదారులు విసిగి వేసారి పోయారు. ఇదిలా ఉంటే అధికారి ఓ కేసులో ఇరుక్కుని జైలుపాలైన విషయం తెలిసిందే. ఆయన జైలుకు వెళ్లిన నెల రోజులకు ఇన్‌చార్జి డీటీఓను నియమించగా ఏడాదిగా ఆయన్నే కొనసాగిస్తూ పూర్తి స్థాయి అధికారిని నయమించడంలో ఈ శాఖ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తూ వస్తున్నారు. మరో పక్క డీటీఓ కార్యాలయానికి సొంత భవనం లేక.. టెస్టింగ్ ట్రాక్‌లేక ఇబ్బందులు తప్పడంలేదు. ఎలాంటి శాస్త్రీయ పద్ధతులు పాటించకుండానే లైసెన్సులు అందజేయడం విమర్శలకు తావిస్తోంది.

ఇన్‌చార్జిని అప్పగించి..

ఏడాది క్రితం వరకు వికారాబాద్ డీటీఓగా బాధ్యతలు నిర్వహించి సొంత అన్నను హత్యచేసేందుకు సుపారి ఇచ్చిన కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. అనంతరం ఆర్టీఏ ఉన్నతాధికారులు ఎట్టకేలకు సూర్యాపేట డీటీఓ వెంకట్‌రెడ్డికి వికారాబాద్ డీటీఓగా అదనపు బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకొన్నారు. దీంతో ఆయన సూర్యాపేట నుంచి రావాల్సి వస్తుండటంతో వారానికి ఒకటి రెండు రోజులు చుట్టపుచూపుగా వికారాబాద్‌కు వచ్చి వెళుతున్నారు. అయితే అస్తవ్యస్తంగా తయారైన జిల్లా ఆర్టీఏను గాడిలో పెట్టాల్సిన సమయంలో ఇలా ఇన్‌చార్జి డీటీఓను నియమించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పూర్తిస్థాయి అధికారి అవసరం

అస్తవ్యస్తంగా తయారైన వికారాబాద్ ఆర్టీఏను పూర్తిగా గాడిలో పెట్టాలంటే ఫుల్‌టైమ్ డీటీఓను నియమించి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుతం సూర్యాపేట డీటీఓగా ఉంటూ వికారాబాద్ ఇన్‌చార్జి డీటీఓగా కొనసాగుతున్న వెంకట్‌రెడ్డినే ఫుల్ టైమ్ డీటీఓగా బాధ్యతలు అప్పగించడం, లేదంటే ఫుల్‌టైమ్ డీటీఓగా మరొకరిని నియమించాలనే అభిప్రాయం ఆ శాఖ ఉద్యోగులతో పాటు ఆయా వర్గాల్లో వ్యక్తం అవుతుంది. లేదంటే పరిస్థితి మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది. ఏడాది కాలంగా రోడ్డు రవాణా శాఖకు పూర్తి స్థాయి జిల్లా అధికారి లేకపోవటంతో కింది స్థాయి ఉద్యోగులకు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి తయారయ్యింది. వాహనదారులు సైతం ఓవర్‌లోడ్‌తో అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

'గుడ్లు'తేలేస్తుండ్రు

- బెంబేలెత్తిస్తున్న కోడిగుడ్ల ధర
- రూ.7 చొప్పున విక్రయం
- మధ్యతరగతి ప్రజలకు తప్పనితిప్పలు



దౌల్తాబాద్: మధ్య తరగతి ప్రజల పౌష్టికాహారమైన కోడిగుడ్డు ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు ఒక్కసారిగా పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు నిత్యావసర ధరలు మండిపోతుండగా మరో వైపు చికెన్, మటన్, చేపల ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు సామాన్యులకు అందుబాటులో ఉండే గుడ్డు ధర కూడా అమాంతంగా పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పౌష్టికాహారం..

ఆరోగ్యంగా ఉండాలంటే బలవర్ధకమైన పౌష్టికాహారం తినాలని వైద్యులు సూచిస్తున్నారు. సామాన్యులు ఎక్కువగా గుడ్లను కొనుగోలు చేస్తారు. ఇమ్యూనిటీని పెంచుకోవడం కోసం ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తుండటం విశేషం. మండలంలో కోడిగుడ్ల ఉత్పత్తి అంతంత మాత్రంగా నే ఉండడంతో ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి పౌల్ట్రీఫాం రైతులు నష్టాలు చవిచూడడం.. కోడిపల్లల పెంపకాన్ని తగ్గించడంతో గుడ్ల ధరల పెరుగుతున్నాయని పలువురు పేర్కొంటునారు. గత ఏప్రిల్‌లో గడ్డు ధర రూ.4నుంచి రూ.4.50వరకు ఉండగా ప్రస్తుతం రిటైల్‌గా రూ.6.50 వరకు ఉంది. ఓల్‌సేల్ వ్యాపారులు మార్కెట్ ధర ప్రకారం గుడ్లు సరఫరా చేస్తున్నప్పటికీ రిటైల్ వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ఉచితంగా కంది విత్తనాల అందజేత

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారం క్లస్టర్‌లోని గ్రామాల రైతులకు సోమవారం జాతీయ ఆహార భద్రత మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) పథకం కింద పీఆర్‌జీ –176 రకం కంది విత్తనాలను అందించారు. గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఈఓ హేమ రైతులకు ఉచితంగా అందించారు. కంది విత్తనాలు కావల్సిన రైతులు వారి క్లస్టర్ పరిధిలో పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సు ఏఈఓలకు అందించి కంది విత్తనాలు పొందాలని, ఒక్కో రైతు ఒకటే ప్యాకెట్ (4కిలోలు) ఇవ్వడం జరుతుందని ఏఓ అనురాధ అన్నారు.



రేగడిమైలారం క్లస్టర్‌లో రైతులకు అందిస్తున్న కంది విత్తనాలు

పొరపాట్లకు తావివ్వొద్దు



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి
- కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లతో ఓటరు జాబితా రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 13 నాటికి డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ఇందుకుగాను ప్రతివారం రాజకీయ పార్టీల నాయకులతో తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు వివిధ పార్టీల ప్రతినిధుల అన్ని వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు అందరూ విధు ల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. ప్రతి బీఎల్‌ఓ దగ్గర ఓటరు జాబితా లిస్టుతో పాటు రిజిస్టర్ అందుబాటులో ఉండాలన్నారు. బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధుల కోసం కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకోవాలన్నారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈఆర్‌ఓ ఆన్‌లైన్ సేవలు జూలై 13వరకు మాత్రమే పనిచేస్తుందని, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు అన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించుకొని పనులు పూర్తి చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సారి ఎన్నికల్లో 80 సంవత్సరాలు పైబడిన వారు, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం గలవారికి ఇంటి నుంచే ఓటింగ్ చేసుకునే విధంగా సదుపాయం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్‌ఓలు ఇలాంటి వారి ఇళ్లకు వెళ్లి వారి ద్వారా ఫారం–8 లో దరఖాస్తు చేయించాలన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు వారితో ఇంటి వద్ద నుంచి ఓటింగ్ చేయిస్తారన్నారు. రాబోవు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించండి

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న 231 అర్జీదారుల నుంచి అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెడింగ్‌లో ఉంచరాదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలి

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు డైట్ కళాశాలల్లో 2021–23 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజును వచ్చేనెల 10వ తేదీలోపు చెల్లించాలని వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 50 అదనపు రుసుముతో జూలై 18వరకు చెల్లించవచ్చన్నా రు. నాలుగు. అంతకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ. 250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ. 150, ఒక సబ్జెక్టుకు రూ. 125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు రెండు ఫొటోలతో పాటు శిక్షణ పొందుతున్న కళాశాలల్లో ఫీజును చెల్లించాలన్నారు.

క్రీడోత్సవాల ముగింపును ఘనంగా నిర్వహిస్తాం

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

యాలాల: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇటీవల నిర్వహించిన పీఎంఆర్ క్రికెట్ టోర్నీ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తం రావు, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 28న ప్రతి మండలం నుంచి యువకులతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు 10వేల మందితో క్రీడా ముగింపు ఉత్సవాలను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం పీఎంఆర్ మెడికల్ కాలేజీ తరపున ఉచితంగా కంటి, వైద్య పరీక్షల శిబిరాలు చేపడతామన్నారు. రోగులకు ఉచిత పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేస్తామని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటితో పాటు పీఎంఆర్ క్రికెట్ టోర్నీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో యువ నాయకుడు సిద్రాల శ్యాంప్రసాద్, నాయకులు పాండుగౌడ్,అశోక్,శరణప్ప, శ్యాం తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి



మాట్లాడుతున్న వీరయ్య

- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య
- వికారాబాద్‌కు చేరుకున్న బస్సుయాత్ర

అనంతగిరి: పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్రూమ్‌లను వెంటనే పూర్తి చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న బస్సు యాత్ర సోమవారం వికారాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం డబుల్ బెడ్రూమ్‌లు వెంటనే పూర్తి చేసి అందజేయాలన్నారు. జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్రూమ్‌లను అర్హులైన నిరుపేదలకే పంచాలని డిమాండ్ చేశారు. జులై 3న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి పేదలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, 5వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు ఆనొద్, వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు ఆశయ్య వెంకటేష్, కోట రమేశ్, జిల్లా ప్రజాసంఘాల నాయకులు మల్లేశం, మైపాల్, రవి, శ్రీను, సుదర్శన్, చంద్రయ్య, లాలయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- నిధుల దుర్వినియోగంతో వేటు
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్ పంచాయతీలో ఎస్‌బీఎం నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ గత కార్యదర్శి కమ్రుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్ సుస్మా సోమవారం తెలిపారు. 2022లో కమ్రుద్దీన్ మంబాపూర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేశారు. 16 సెప్టెంబర్ 2022 నుంచి 08 డిసెంబర్ 2022 వరకు ఐదు చెక్కుల ద్వారా రూ. 10.20 లక్షలు ఫోర్జరీ సంతకాలతో స్వచ్ఛభారత్ (ఎస్‌బీఎం) మరుగుదొడ్లకు సంబంధించిన నిధులు డ్రా చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన సర్పంచ్ శ్రావణ్‌కుమార్, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ ఈ ఏడాది ఏప్రిల్‌లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ విచారణ చేపట్టారు. కమ్రుద్దీన్ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేల్చారు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్ నారాయణకు అందజేశారు. దీంతో కమ్రుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీఓ షేక్ సుస్మా తెలిపారు.

అడ్మిషన్లు ప్రారంభం

కొడంగల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని సెంటర్ కో ఆర్డినేటర్ జె.రాజారామ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 31వ తేదీ నాటికి ఇంటర్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్ అర్బన్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ముదిరాజ్‌ల మద్దతు ఉండదని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ముదిరాజ్ సోమవారం తెలిపారు. ముదిరాజ్ విలేకరిపై కౌశిక్‌రెడ్డి దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది ముదిరాజ్ ఓటర్లు ఉన్నారని ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు.

నకిలీ విత్తనాలను గుర్తిస్తే నష్టాల నివారణ

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: నకిలీ విత్తనాలను గుర్తిస్తే నష్టాల బారిన పడకుండా ఉండవచ్చని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు నాటే సమయం ఆసన్నమైనందున అక్రమార్కులు అమాయక రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగడతారని తెలిపారు. పూర్తి స్థాయిలో పరీక్షించిన తరువాతే విత్తనాలను కొనుగోలు చేయాని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాల జాడ తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఫీ'జులుం'పై చర్యలు తీసుకోవాలి

షాద్‌నగర్: ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని.. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు పాఠశాల దోపిడీని అరికట్టాలని డి మాండ్ చేస్తూ సోమవారం షాద్‌నగర్‌లో ఏబీవీపీ నేతలు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయ వంతమైంది. ఈ సందర్భంగా పట్టణంలో ఏబీవీపీ నేతలు బైక్ ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయించారు. బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ముందుగానే సెలువు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నేతలు భానుప్రసాద్, పుట్నాల సాయి కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులకు నేటి కీ పుస్తకాలను పంపిణీ చేయలేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

రూ. లక్ష సాయం ఎందరికో?

600 మంది దరఖాస్తు

- ఎవ్వరికి దక్కుతుందోనని చర్చ
- క్షేత్రస్థాయిలో పరిశీలన మరూ..

దౌల్తాబాద్: బీసీ కుల వృత్తిదారులకు అందించే లక్ష సాయం కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో ఎందరికి సాయం అందుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అధికారులు దరఖాస్తుల పరిశీలన మొదలు పెట్టారు. కొందరు కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందక రుణ సాయం కోసం దరఖాస్తు చేయలేక పోయారు. గడువు పెంచాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 600మంది సాయం కోసం దరఖాస్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ దరఖాస్తులు అందజేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల వారీగా దరఖాస్తులను వేరు చేశారు. పలు చోట్ల క్షేత్రస్థాయిలో పరిశీలనను ప్రారంభించారు. ఆయా కులాలకు చెందిన వారు కులవృత్తి కోసమే దరఖాస్తు చేశారా..? యూనిట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. అనే వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దారఖాస్తు చేసుకునే వారి వార్షిక ఆదాయం రూ. 2లక్షల లోపు ఉండాలి. ఆ కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. ఈ నెల 26వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం అర్హుల జాబితాను కలెక్టర్‌కు పంపనున్నారు. కలెక్టర్ ఆమోదంతో దశలవారీగా జూలై 15నుంచి ఆర్థిక సాయాన్ని అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టడంతో సర్వర్ ప్రాబ్లంతో కొందరికి కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందలేదు. దీంతో వారు దరఖాస్తు చేయలేకపోయారు. అలాంటి వారు గడువు పెంచాలని కోరుతున్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

రూ. లక్ష సాయం ఎందరికో ?

దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంతమందికి రూ. లక్ష సాయం అందుతుంది అనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాయం అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దరఖాస్తులను పరిశీలిస్తున్నాం



రూ.లక్ష సాయం కోసం మండల వ్యాప్తంగా 600మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అనంతరం జాబితాను కలెక్టర్ కార్యాలయానికి పంపుతాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుంది.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్ రూరల్: విద్యార్థులు లక్ష్యం దిశగా చదువుతూ సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలో మొదటగా మాదకద్రవ్యాల బారిన పడేది యువత, విద్యార్థులే అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడాలని సూచించారు. క్రమశిక్షణతో సక్రమమైన జీవితాన్ని గడుపుతూ ఉన్నత చదువులు చదువుతూ తల్లిదండ్రులు, కళాశాలలకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలను సందర్శించారు. కళాశాల మైదానంలో మట్టి కుప్పలు ఉండడంతో తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, న్యాయవాదులు, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, కొడంగల్ ఏఎస్‌ఐ బాలకిషన్, బొంరాస్‌పేట ఎస్‌ఐ శంకర్, దౌల్తాబాద్ ఎస్‌ఐ రమేష్, కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

అతిరుద్ర మహాయాగానికి రండి

పలు అసోసియేషన్లు, కౌన్సిలర్లను ఆహ్వానించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలో జూలై 3నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న అతిరుద్ర మహాయాగానికి రావాలని పలు అసోసియేషన్ల సభ్యులను, కౌన్సిలర్లను ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సోమవారం స్వయంగా ఆహ్వానించారు. నియోజక వర్గ ప్రజల సంక్షేమార్థం, అలాగే పంటలు బాగా పండాలని కోరుతూ శ్రీ రాజశ్యామల, శత చండీ, సౌర, లక్ష్మీ సుదర్శన సహిత అతిరుద్ర మహాయగం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. వీరశైవ సమాజం, ఆర్యవైశ్య సమాజం, రాజ్‌పుత్ తదితర కుల సంఘాలు, గంజ్ అసోసియేషన్ సభ్యుల తోపాటు, మున్సిపల్ కౌన్సిలర్లను ఆహ్వానించారు. 11వేల మంది పుణ్య దంపతులతో నిర్వహించనున్న మహాయాగంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



గంజ్ అసోసియేషన్ సభ్యులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

రక్షణ విస్మరించి.. అడ్డగించి..

- 'కోట్‌పల్లి'కి పర్యాటకులు రాకుండా అడ్డుకుంటున్న అధికారులు
- నలుగురు చనిపోయారని సాకుగా చూపి నిషేధం
- అయినా తరలివస్తున్న జనం
- సందర్శనకు అనుమతి ఇవ్వాలని పలువురి విన్నపం

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు రక్షణ కల్పించాల్సిన అధికారులు ఆ విషయాన్ని మరచి.. అక్కడికి ఎవ్వరూ రాకుండా నిషేధం విధించడం విమర్శలకు తావిస్తోంది. జనవరి 16న పూడూర్ మండలం మన్నెగూడకు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు యువకులు ఈత కోసం ప్రాజెక్టుకు వచ్చి నీట మునిగి చనిపోయారు. దీన్ని సాకుగా చూపి పోలీసు, ఫారెస్టు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రాజెక్టు వద్దకు పర్యాటకులు రాకుండా అడ్డుకుంటున్నారు. ఇక్కడికి వచ్చే వారికి సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ విషయాన్ని విస్మరించి ఇలా నిషేధం విధించడం ఏమిటని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో కోట్‌పల్లికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ నీటిలో సరదాగా ఆడుకొని సేద తీరుతారు. యువతీ యువకులు గంటల తరబడి నీటిలో సరదాగా ఈత కొడతారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే తలమానికమైన ఈ ప్రాజెక్టును పర్యాటక రంగానికి దూరం చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నించారు. ప్రాజెక్టు వద్ద కాయ కింగ్ బోటింగ్ సైతం నిషేధించారు. 6 నెలల గడిచినా బోటింగ్ సంస్థకు అనుమతి ఇవ్వకపోవడంతో వారు హైకోర్టుకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు పర్యాటకులు, బోటింగ్‌కు అనుమతి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో పర్యాటకులు



ప్రాజెక్టు వద్ద సందర్శకులు

అదృశ్యమై.. ఆపై శవమై..

- ప్రేమ వ్యవహారంపై మందలించిన తల్లి
- మరుసటి రోజు ఇంటి నుంచి వెళ్లిపోయిన నవీన్
- 11 రోజుల తర్వాత విగతజీవిగా..

ధారూరు: పదకొండు రోజుల క్రితం అదృశ్యమైన ఓ యువకుడు శవమై కనిపించాడు. ఈ సంఘటన సోమవారం ధారూరు మండల కేంద్రంలోని శాలివాహన కాలనీ సమీప వాగు పక్కన వెలుగు చూసింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరుకు చెందిన గుర్రం నవీన్(19)ను పని విషయంలో ఈ నెల 15వ తేదీ రాత్రి తల్లి నర్సమ్మ మందలించింది. ప్రేమ వ్యవహారంపై తిట్టినట్లు తెలిసినంది. 16వ తేదీ ఇంట్లోంచి వెళ్లిపోయిన నవీన్ తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 20న తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం ధారూరు శాలివాహన కాలనీ సమీపంలోని వాగు పక్కన కుళ్లిన మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకొని నర్సమ్మను పిలిపించారు. మృతదేహం వద్ద చెప్పులు, బట్టలను నర్సమ్మ గుర్తించింది. దీంతో మృతుడు నవీన్‌గా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రేమ వ్యవహారం కారణంగానే నవీన్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నవీన్(ఫైల్)

రోడ్డు దిగితే ఆస్పత్రి పాలే..!



ఎన్కెపల్లి వద్ద రోడ్డు పక్కనే ప్రమాదకర గుంత

బంట్వారం: మండలంలోని ఎన్కెపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే పెద్ద గుంత పడింది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో కల్వర్టుపై ఏర్పడిన గుంత కనిపించడం లేదు. పొరపాటున వాహనాన్ని రోడ్డు నుంచి కిందకు దింపితే ప్రమాదానికి గురికాక తప్పదు. ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

తుక్కు డబ్బుల గొడవతోనే..

గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ

శంషాబాద్: తుక్కు సామాన్లు విక్రయించిన డబ్బుల పంపకంలో జరిగిన గొడవే కొత్తూరులో చోటు చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి(55) హత్యకు కారణంగా తేలింది. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం, రాయచూర్‌కు చెందిన తెలుగు నాగప్ప ఇరవై రోజుల కిందట కాచిగూడకు వచ్చి అక్కడే నివాసముంటున్నాడు. ఇనుప సామాన్లు, తుక్కు ఏరుకుని వాటిని విక్రయించేవాడు. ఈ నెల 23న రాత్రి అతడికి కొత్తూరులో గుర్తు తెలియని వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి చేగూరు సమీపంలోని స్క్రాప్ దుకాణంలో తాము సేకరించిన తుక్కును విక్రయించారు. డబ్బుల పంపకం విషయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. అప్పటికే ఇద్దరు మద్యం మత్తులో ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తి నాగప్పను కట్టెతో కొట్టడమేగాక డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత కొత్తూరు సమీపంలోని మెగా ఫ్లోర్ మిల్ వద్ద అతను మరోమారు నాగప్పపై కర్రతో దాడి చేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన నాగప్ప అతడి వద్ద ఉన్న కర్ర లాక్కుని చితకబాదాడు. అనంతరం తలపై రాయితో మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ ఏసీపీ భాస్కర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు ఆదివారం రాత్రి శంషాబాద్ పాలమాకుల వద్ద అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా మృతుడి వివరాలు గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు

వర్షాలతో సుద్ద తవ్వకాలకు బ్రేక్



వర్షాలతో నిర్మానుష్యంగా సుద్ద గని

పెద్దేముల్: వర్షాలు ప్రారంభం కావడంతో జిల్లాలో ముడి సుద్ద తవ్వకాలకు బ్రేక్ పడింది. ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తవ్వకాలు, ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలోని పెద్దేముల్, ధారూర్, మోమిన్‌పేట, కోటపల్లి తోపాటు పలు మండలాల్లో ముడి సుద్ద గనులు ఉన్నాయి. ఇక్కడ లభించే సుద్దకు మంచి డిమాండ్ ఉండడంతో విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పెద్దేముల్ మండలం రేపల్లి, గోపాల్‌పూర్, రుద్రారం, తింసాన్‌పల్లి మరి కొన్ని గ్రామాల్లో ఏటా లక్షల టన్నుల తవ్వకాలు జరుగుతుంటాయి. రాయల్టీ ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో సుద్ద తవ్వకాలు ప్రారంభమై జూన్, జూలై నెలలో నిలిచిపోతాయి. ఈ ఏడాది టన్ను తెల్ల సుద్ద ధర రూ.650 నుంచి రూ.750 కాగా ఎర్ర సుద్ద ధర రూ.500 నుంచి రూ.600లు పలికింది. మళ్లీ డిసెంబర్, జనవరి మాసాల్లో సద్దు తవ్వకాలు ప్రారంభమవుతాయని వ్యాపారులు తెలిపారు.

కబళించిన కరెంట్ తీగ



సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్)లో జహంగీర్ (ఫైల్)

- విద్యుదాఘాతానికి యువకుడి మృతి
- మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన
- విద్యుత్ శాఖ అధికారుల హామీతో ఆందోళన విరమణ

కడ్తాల్: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి ఆరీఫ్, సాబేరా దంపతుల చిన్నకుమారుడు జహంగీర్(28) తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ.. వ్యవసాయం, గేదెల పెంపకం, పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు రోజు మాదిరిగానే జహంగీర్ గేదెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లాడు. గడ్డివాము వద్దకు కొన్ని గేదెలు వెళ్లగా, వాటిని తప్పించే క్రమంలో సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరును తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

మృతదేహంతో ఆందోళన

జహంగీర్ మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. మృతదేహాన్ని సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి షాద్‌నగర్-కడ్తాల్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. లైన్‌మన్, హెల్పర్‌లను వెంటనే తొలగించాలని, ఏఈపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఆమనగల్లు సీఐ ఉపేందర్.. ఏఈ శ్రీనివాస్, ఏఈ నరేందర్‌తో ఫోన్లో మాట్లాడి వారిని రావిచేడ్‌కు రప్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, లైన్‌మన్‌పై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పరంగా రూ.5 లక్షలు సాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా కొంత నగదును కూడా అందించారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

అగమ్యగోచరంగా 'భగీరథ' లైన్‌మెన్లు

ఉద్యోగ భద్రత లేక ఆందోళన

- నామమాత్రపు జీతాలతో నెట్టుకొస్తున్న వైనం
- కాంట్రాక్టర్ దయతలిస్తే కొలువు.. లేదంటే మరో పని వెతుక్కోవాల్సిందే

కుల్కచర్ల: మిషన్ భగీరథ పథకం అమల్లో ముఖ్య భూమిక వాటర్ లైన్‌మెన్లదే.. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రజలకు తాగునీటి సరఫరాలో నిమగ్నమవుతారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా తక్షణం స్పందిస్తారు. అయితే ఇలాంటి వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం ఆందోళన కలిగించే అంశమే.. కనీస వేతనం అమలు కాక కుటుంబ పోషణ కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి పనిచేస్తున్నా గుర్తింపు లేదు

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో మిషన్ భగీరథ పథకం కింద 25మంది వాటర్ లైన్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 260మంది పని చేస్తున్నారు. వీరు లేబర్ కాంట్రాక్టర్లకు అనుబంధంగా తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. సంవత్సరాల తరబడి పని చేస్తున్నా సరైన గుర్తింపు లేదని ఆవేదనకు గురవుతున్నారు. ఉద్యోగ భద్రత లేక తమ పరిస్థితి గాలిలో దీపంలా మారిందని వాపోతున్నారు. విధి నిర్వహణలో తమకు ఒక సమయం అంటూ లేదని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు.. ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి పోవాల్సి వస్తోందని తెలిపారు.

నామమాత్రపు జీతాలు

మిషన్ భగీరథ లైన్‌మెన్లను లేబర్ కంపెనీల ఆధ్వర్యంలో నియమించారు. దీంతో వారికి ఎలాంటి అలవెన్స్ అందడం లేదు. విధి నిర్వహణకు ఒక సమయమంటూ లేకుండా పోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌కు నచ్చితే ఉద్యోగం.. లేకుంటే మరో పని వెతుక్కోవాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. ఒక్కో లైన్‌మెన్‌కు నెలకు రూ. 9వేలు జీతం చెల్లిస్తున్నారు. ఈ డబ్బు తమ ఖర్చులు, ఇంటి అవసరాలకు మాత్రమే సరిపోతోందని, పిల్లల చదువులు, భవిష్యత్ అవసరాలకు ఒక్క రూపాయి కూడా మిగలడం లేదని తెలిపారు. ఇక అనారోగ్య సమస్యలు ఎదురైతే అప్పులు చేయాల్సిందేనని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి ఉద్యోగ భద్రత తోపాటు కనీసవేతం, విధుల సమయం కేటాయించాలని వారు కోరుతున్నారు.



పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించాలి



మిషన్ భగీరథ పథకంలో వాటర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నా. జీతం రూ.9 వేలు మాత్రమే వస్తుండడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఏజెన్సీల రూపంలో కాకుండా ప్రభుత్వ అనుబంధ రంగంగా గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అన్ని అలవెన్సులు అందేలా చూడాలి.

– వెంకటయ్య, మిషన్ భగీరథ వాటర్ లైన్‌మెన్

చాలీచాలని జీతాలు



సమయంతో సంబంధం లేకుండా విధులు నిర్వహిస్తున్నా. కానీ కనీసవేతనం అమలు కావడం లేదు. జీతం కుటుంబ అవసరాలకు కూడా సరిపోవడం లేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయమేస్తోంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– మల్లేశ్, మిషన్ భగీరథ వాటర్ లైన్‌మెన్